## ధాన్యం కొనుగోళ్లలో రైతులకు నష్టం

- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సీతయ్య


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య

తుంగతుర్తి, మే 6 : ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రెండు లక్షల క్వింటాళ్ల పైనే ధాన్యం రాగా 21 ఐకేపీ కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు కేవలం లక్ష క్వింటాలు మాత్రమే కొనుగోలు చేశారన్నారు. దాదాపు 40 రోజుల నుంచి రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నా పట్టించుకునే నాథుడు లేరని విమర్శించారు. అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గోపగాని రమేశ్, ఉప్పుల నాగమల్లు, పోలేపాక పరమేశ్, గోపగాని వెంకన్న, నల్లబెల్లి వెంకన్న, కొండగడుపుల ఎల్లయ్య పాల్గొన్నారు.

## నిరుపేదలకు అల్పాహారం పంపిణీ


నేరేడుచర్లలో నిరుపేదలకు అల్పాహారం పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల, మే 6 : పట్టణ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిమ్మల పాండురంగారావు సహకారంతో మంగళవారం నిరుపేదలకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జిలకర రామస్వామి మాట్లాడుతూ పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం సేవలందించంలో లయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ ముందుటుందన్నారు. కార్యక్రమంలో జోన్ చైర్మన్ చల్లా ప్రభాకర్‌రెడ్డి, డిస్ట్రిక్ట్ చైర్మన్ బట్టు మధు, మాజీ అధ్యక్షుడు యడవల్లి సత్యనారాయణ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గుండ్రెడ్డి సైదిరెడ్డి, కోశాధికారి షేక్. యూసుఫ్, సభ్యులు ఉన్నారు.

**వాసవీ, వనితా క్లబ్ ఆధ్వర్యంలో**

నేరేడుచర్ల వాసవీ, వనితా క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద మంగళవారం పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు.

## రజక సంక్షేమ సంఘం స్టేట్ పొలిట్ బ్యూరో సభ్యుడిగా శ్రీను


చిలకరాజు శ్రీను

నేరేడుచర్ల, మే 6 : రజక సంక్షేమ సంఘం స్టేట్ పొలిట్ బ్యూరో సభ్యుడిగా నేరేడుచర్లకు చెందిన చిలకరాజు శ్రీనును నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పు భిక్షపతి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చేరాల ప్రకాశ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

## విప్లవ సాంస్కృతిక ఉద్యమానికి రామారావు కృషి


నివాళులర్పిస్తున్న నాయకులు

గరిడేపల్లి, మే 6 : విప్లవ సాంస్కృతిక ఉద్యమానికి మండల పరిధిలోని వెలిదండ గ్రామానికి చెందిన కామ్రేడ్ అరుణోదయ రామారావు ఎనలేని కృషి చేశారని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ గ్రామ కార్యదర్శి మేకల కనకారావు అన్నారు. వెలిదండ గ్రామంలో మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో రామారావు 6వ వర్ధంతి సభను నిర్వహించారు.

## విజయ్ దేవరకొండను అరెస్ట్ చేయాలి : అంజినాయక్

గరిడేపల్లి, మే 6 : సినీ నటుడు విజయ్ దేవరకొండ రెట్రో సినిమా ఫంక్షన్‌లో హాజరై గిరిజనులపై చేసిన వ్యాఖ్యలను తెలంగాణ గిరిజన శక్తి నియోజకర్గ అధ్యక్షుడు గుగులోతు అంజినాయక్ మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. వెంటనే ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని కోరారు.

## దేవాలయ భూముల కౌలుకు వేలం

చింతలపాలెం, మే 6 : మండలంలోని రేబల్లె గ్రామంలో గల వేంకటేశ్వరస్వామి ఆలయ పరిధిలో ఉన్న వ్యవసాయ భూములను వేలం ద్వారా కౌలుకు ఇవ్వనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి లక్ష్మణ్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో సర్వే నంబర్ 178/1 లో 6.39 గుంటలు, అదే విధంగా తమ్మవరం రెవెన్యూ శివారులో కొత్తూరు గ్రామంలో సర్వే నంబర్ 417/ గల భూములు రెండేండ్లు కౌలు చేసేందుకు గానూ వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనేవారు రూ.5 వేలు డిపాజిట్ కట్టాలని చెప్పారు. ఆసక్తి గల వారు ఆలయ అర్చకులను సంప్రదించాలని సూచించారు.

## జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన న్యాయవాద పాలక వర్గం

హుజూర్‌నగర్, మే 6 : సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మి శారదను హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆమె ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రాంరెడ్డి మాట్లాడుతూ నూతనంగా మంజూరైన రెండు అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల తాత్కాలిక భవనాల నిర్మాణాల కోసం స్థల పరిశీలన కోసం హుజూర్‌నగర్ కోర్టుకు రావాల్సిందిగా ప్రధాన న్యాయమూర్తిని ఆహ్వానించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ నాయకులు యాదగిరి, జక్కుల నాగేశ్వర్‌రావు, కాల్వ శ్రీనివాస్‌రావు, రవికుమార్, శ్రీనివాస్ , ఏజీపీలు రేణుకా దేవి, సురేశ్ పాల్గొన్నారు.


జెర్సీ పంపిణీ చేస్తున్న వెంకట్‌రెడ్డి

## జెర్సీ పంపిణీ

నడిగూడెం, మే 6 : మండల కేంద్రంలో జరుగుతున్న సమ్మర్ క్యాంపులో కబడ్డీ శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయుడు ఎలక వెంకట్‌రెడ్డి రూ.10వేల విలువైన జెర్సీని మంగళవారం అందించారు. కార్యక్రమంలో కోచ్ పల్లపు నాగేశ్వర్‌రావు, మీరాజుద్దీన్, రియాజ్, ఇంతియాజ్, ప్రదీప్, కరుణాకర్, సాయి, మల్లి పాల్గొన్నారు.

## కార్మికులు ఐక్య ఉద్యమాలు నిర్వహించాలి : సీపీఎం

మఠంపల్లి, మే 6 : కార్మిక, కర్షకులు ఐక్య ఉద్యమాలు నిర్వహించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు భూక్యా పాండూనాయక్ అన్నారు. మండలంలోని మట్టపల్లి గ్రామంలో మేడే వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో ఆయన జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మాలోతు బాలూనాయక్, నాయకులు ఎస్.జగన్మోహన్‌రెడ్డి, పొడిచెట్టి రాము, భూక్యా సైదానాయక్, మాలోతు లచ్చూనాయక్, దాసు, బాష, గోపాల్, రామస్వామి తదితరులున్నారు.

### దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి : నాగార్జున్‌రెడ్డి

సూర్యాపేటటౌన్, మే 6 : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20న దేశవ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లు నాగార్జున్‌రెడ్డి అన్నారు. స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సీఐటీయూ, తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, మట్టిపల్లి సైదులు, దండ వెంకట్‌రెడ్డి, ఎం.రాంబాబు, వేల్పుల వెంకన్న, కందాల శంకర్‌రెడ్డి ఉన్నారు.

## లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ


లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో మాజీ ఎంపీ బడుగుల తదితరులు

సూర్యాపేటటౌన్, మే 6 : జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి లబ్ధిదారులకు మంగళవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఆయన వెంట మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, మాజీ జడ్పీటీసీ జీడీ భిక్షం ఉన్నారు.

సూర్యాపేటరూరల్ : మండల పరిధిలోని దాస్‌తండాలో మంగళవారం జరిగిన కనకదుర్గమ్మ తల్లి జాతరలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. మాజీ జడ్పీటీసీ జీడి భిక్షం, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వంగాల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నూనావత్ విజయ, మోతీలాల్, నెమ్మాది భిక్షం, జూలకంటి జీవన్‌రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

## వేసవి క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి


అనంతగిరి : శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాస్‌రావు

మేళ్లచెర్వు, మే 6 : రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో మేళ్లచెర్వు, రామాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఈ నెల 7వ తేదీ నుంచి పదిహేను రోజుల పాటు నిర్వహించే వేసవి క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ వెంకట్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంపులో 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు డ్రాయింగ్, గేమ్స్, సాంస్కృతిక అంశాలు, స్పోకెన్ ఇంగ్లీష్, మ్యాథ్స్ పజిల్, సైన్స్ ప్రయోగాల వంటి అంశాలపై వలంటీర్లు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు అవగాహన కల్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

చింతలపాలెం : మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7 నుంచి 23 వరకు 15 రోజుల పాటు మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించే క్యాంపులో స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్ క్రాఫ్ట్, డ్యాన్స్ వంటి అంశాల్లో విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

కోదాడ రూరల్ : ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వేసవి వాలీబాల్ శిక్షణా శిబిరాన్ని విద్యార్థులు, యువకులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి ఎండీ సలీం షరీఫ్ అన్నారు. కోదాడ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం తెలంగాణ రైజింగ్ ఉచిత వాలీబాల్ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం డి.మార్కండేయ, జాతీయ వాలీబాల్ క్రీడాకారులు పంది కల్యాణ్, చిలుముల వెంకటేశ్, తురక సాయిరాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనంతగిరి : సర్కారు బడుల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు ప్రభుత్వం వేసవి శిక్షణ తరగతులను ఏర్పాటు చేస్తుందని మండల విద్యాధికారి తల్లాడ శ్రీనివాస్‌రావు అన్నారు. మండల పరిధిలోని గోండ్రియాల జడ్పీహెచ్‌ఎస్‌లో మంగళవారం వేసవి శిక్షణ శిబిరాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మండలంలో శాంతినగర్, గోండ్రియాల జడ్పీహెచ్‌ఎస్‌లలో వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

పెన్‌పహాడ్ : పెన్‌పహాడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమ్మర్ క్యాంపు శిక్షణ శిబిరాన్ని మండల విద్యాధికారి నకిరేకంటి రవి ప్రారంభించారు.

నాగారం : మండలంలోని ఈటూరు, ఫణిగిరిలో జడ్పీహెచ్‌ఎస్‌లో వేసవి శిక్షణా శిబిరాన్ని మండల విద్యాధికారి వాసం ప్రభాకర్ ప్రారంభించారు.

## పోలీస్ కుటుంబానికి ఆర్థిక చేయూత


బాధిత కుటుంబానికి చెక్కు అందిస్తున్న ఎస్పీ నరసింహ

సూర్యాపేటటౌన్, మే 6 : తిరుమలగిరి పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న హెడ్ కానిస్టేబుల్ రమేశ్ ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబానికి పోలీసు చేయూత పథకం ద్వారా రూ.2లక్షల చెక్కును ఎస్పీ కె.నరసింహ మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అందించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఎం.నాగేశ్వర్‌రావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ నాగభూషణరావు, పోలీస్ సంఘం అధ్యక్షుడు రామచందర్‌గౌడ్, వెల్ఫేర్ ఆర్ఎస్ఐ సాయిరాం, భరోసా సెంటర్, మహిళా ఎస్ఐ మౌనిక, సంఘం సభ్యులు ఉన్నారు.

## వడదెబ్బ తగులకుండా జాగ్రత్త పడాలి : డీఎంహెచ్ఓ


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి కోటాచలం

మేళ్లచెర్వు, మే 6 : వేసవిలో వడదెబ్బ తగులకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్ఓ కోటాచలం వైద్య సిబ్బందికి సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జరిగిన ఆశ కార్యకర్తల సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. ఉపాధి హామీ, ఇందిరా క్రాంతి పథకంలో పనిచేసే వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందించాలని సూచించారు. గర్భిణులు ప్రభుత్వ దవఖానలోనే కాన్పు చేయించుకునేలా ప్రోత్సహించాలని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ జయ మనోహరి, మండల వైద్యాధికారి సీతామహాలక్ష్మి, వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నా భూమిని కాపాడండి

- అక్రమంగా వేరే వాళ్లకు పట్టా చేశారని మహిళ ఆవేదన


మాట్లాడుతున్న బాధితురాలు నిమ్మల భారతమ్మ

సూర్యాపేటటౌన్, మే 6 : తన పేరు మీదున్న ఐదెకరాల భూమిని తన మరిది అక్రమంగా నకిలీ పత్రాలు సృష్టించి పట్టా చేయించుకున్నాడని, ఆయనకు అధికారులు కూడా సహకరించారని ఓ మహిళ ఆరోపిస్తున్నది. ఆత్మకూర్.ఎస్ మండల పరిధిలోని ఇస్తాళపురం గ్రామానికి చెందిన నిమ్మల భారతమ్మ మంగళవారం జిల్లాకేంద్రంలో విలేకరులతో తెలిపిన వివరాల ప్రకారం.. నెమ్మికల్ శివారు 75, 76 సర్వే నంబర్లలో నిమ్మల భారతమ్మ భర్త భద్రయ్యకు 8ఎకరాల భూమి ఉండగా అందులో భారతమ్మ పేరు మీద 5ఎకరాలు ఉన్నది. మిగతా మూడెకరాలు భారతమ్మ మరిది భార్య సంధ్య పేరు మీద పట్టా చేశారు. 2009లో భారతమ్మ భూమిని కూడా మరిది అక్రమంగా పట్టా చేయించుకునేందుకు ప్రయత్నించగా భర్త భద్రయ్య తాసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా ఆయన ప్రొహిడవిట్ జారీ చేశారు. 2019లో భద్రయ్య మృతి చెందడంతో భారతమ్మ ఐదుగురు బిడ్డలు, ఆమె తలో దిక్కు వెళ్లిపోయారు. 2024లో భూమిని చదును చేసి కౌలుకు ఇచ్చేందుకు గ్రామానికి రాగా.. భారతమ్మ మరిది మాధవరావు అప్పటికే నకిలీ పత్రాలు సృష్టించి అక్రమంగా పాస్‌బుక్ తీసుకొచ్చి ఆ భూమి తనదేనని భారతమ్మను బెదిరించాడు. ఈ విషయమై భారతమ్మ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా ప్రొహిబెటేషన్‌లో ఉన్న భూమిని ఎలా పట్టా చేశారని ప్రశ్నిస్తూ అధికారులను విచారణకు ఆదేశించారు. అధికారులు విచారణ చేసి అక్రమంగా పట్టా చేయించుకున్నది వాస్తవమేనని తేల్చారు. అధికారులు 20 రోజుల క్రితం విచారణ చేసి పాస్‌బుక్‌ను క్యాన్సల్ చేస్తామని చెప్పి ఇప్పటి వరకు పట్టించుకోవడం లేదని భారతమ్మ ఆరోపించారు. అధికారులు మరోసారి విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని భారతమ్మ అధికారులను కోరారు.

## విద్యార్థినులకు సన్మానం

నేరేడుచర్ల, మే 6 : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివి ఇంటర్ సెకండియర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన గరిడేపల్లి మండలం అప్పన్నపేట గ్రామానికి చెందిన అఖిల, స్రవంతిని మంగళవారం ఆ కళాశాల సిబ్బంది వారి గ్రామానికి వెళ్లి ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రభుత్వ కళాశాల బలోపేతం కోసం పెంచికల్‌దిన్న, జాన్‌పహాడ్, పొనుగోడు, అప్పన్నపేట, అబ్బిరెడ్డిగూడెం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ కళాశాలలోనే విద్యార్థులను చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్‌కు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెంకటరమణ, అధ్యాపకులు మద్దిమడుగు సైదులు ఉన్నారు.

### ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలి : ఏఓ కల్యాణ చక్రవర్తి

పాలకవీడు, మే 6 : కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు కోసం ప్రతీ రైతు ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని ఏఓ కల్యాణ చక్రవర్తి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన హాజరై మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం అందిస్తున్న విశిష్ట సంఖ్యను పొందటానికి పట్టాదార్ పాసు పుస్తకంతో పాటు, ఆధార్ కార్డు, మొబైల్ నంబర్‌తో వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని ఆయన సూచించారు.

### భీమ్‌రెడ్డి వర్ధంతిని విజయవంతం చేయాలి : పాపయ్య

అర్వపల్లి, మే 6 : ఈ నెల 9న మండల కేంద్రంలో భీమ్‌రెడ్డి నర్సింహారెడ్డి 17వ వర్ధంతిని విజయవంతం చేయాలని పూలే అంబేద్కర్ ఆశయ సాధన వ్యవస్థాపక అధ్యక్షుడు ఈదురు వీర పాపయ్య మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## ధాన్యం కాంటాలు త్వరగా వేయాలి

**– అదనపు కలెక్టర్ రాంబాబు**

చివ్వెంల, మే 6 : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు త్వరగా వేసి వెంటనే మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. సూర్యాపేట మున్సిపాటీ పరిధిలోని కుడకుడలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించి మాట్లాడారు.

### కొనుగోళ్లు వేగంగా చేపట్టాలి : తాసీల్దార్ అమీన్‌సింగ్

మద్దిరాల : ధాన్యం కొనుగోలు కేంద్రాలల్లో కాంటాలు వేగవంతం చేయాలని తాసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. మండలంలోని పోలుమల్ల గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో రికార్డులను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు.

### ఉచిత పథకాలు రద్దు చేసి విద్య, వైద్యం అందించాలి : వీరస్వామి

సూర్యాపేటటౌన్, మే 6 : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న అనవసర ఉచిత పథకాలను రద్దు చేసి ప్రజలకు అత్యవసరమైన విద్య, వైద్యాన్ని పూర్తి స్థాయిలో ఉచితంగా అందించాలని తెలంగాణ జై గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, రియల్ ఎస్టేట్ వ్యాపారుల సంఘం జిల్లా అధ్యక్షుడు పంతంగి వీరస్వామిగౌడ్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గొప్పలకు పోయి ఉచిత పథకాలకు అధిక నిధులు కేటాయిస్తూ విద్య, వైద్యాన్ని నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. సమావేశంలో రియల్ ఎస్టేట్ అసోసియేషన్ పట్టణాధ్యక్షుడు జలగం సత్యంగౌడ్, జిల్లా గౌరవ సలహాదారుడు దేవత్ కిషన్‌నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెన్న శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కోశాధికారి పాల సైదులు, జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి అంజయ్య ఉన్నారు.

### పాలన చేతకాదని చేతులెత్తేసిన సీఎం : సీపీఎం

పాలకవీడు, మే 6 : పాలన చేతకాదని చేతులెత్తేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి వైఖరి చూసి రాష్ట్ర ప్రజలంతా నవ్వుకుంటున్నారని సీపీఎం మండల కార్యదర్శి అనంత ప్రకాశ్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజలకు శుష్క వాగ్దానాలు చేసి అధికారంలోకి రాగానే శూన్య హస్తాలు చూపుతుందని ఎద్దేవా చేశారు. సీఎం స్థాయిని రేవంత్‌రెడ్డి దిగజారుస్తున్నాడని, రాష్ట్ర ఉద్యోగులను పరోక్షంగా విమర్శిస్తున్నాడని, ఆయన ప్రసంగం దిగజారుడు తనానికి నిదర్శనమని ఆరోపించారు. ఎన్నికల ముందు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సీఎం రేవంత్‌రెడ్డికి తెలియదా అని ఆయన ప్రశ్నించారు. అధికారంలోకి రావడమే లక్ష్యంగా అడ్డగోలుగా హామీలిచ్చి, వచ్చాక అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు.

### సీఎం రేవంత్ వ్యాఖ్యలు బాధాకరం : సీతారామయ్య

కోదాడ : ప్రభుత్వ ఉద్యోగులు, పింఛన్‌దారుల పట్ల సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలు బాధాకరమని, వాటిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు విశ్రాంత ఉద్యోగ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య అన్నారు. పట్టణంలోని విశ్రాంత భవన్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు తీవ్రంగా కృషి చేశామని చెప్పారు. ఎన్నికల్లో తమకు ఇచ్చిన హామీలనే అమలు చేయమని కోరుతున్నట్లు పేర్కొన్నారు.

## ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలి : డీఆర్డీఓ అప్పారావు


నర్సరీలను పరిశీలిస్తున్న డీఆర్డీఓ అప్పారావు

మోతె, మే 6 : ఉపాధి హామీ పనుల వద్ద ఎండ తగులకుండా కూలీలకు కనీస వసతులు కల్పించాలని డీఆర్డీఓ అప్పారావు అన్నారు. మండల పరిధిలోని హుస్సేనాబాద్ గ్రామంలో నర్సరీ, ఉపాధి హామీ పనులను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. గ్రామంలో ఏ పనులు చేస్తున్నారో ఫీల్డ్ అసిస్టెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయులు, ఏపీఓ నగేశ్, పంచాయతీ కార్యదర్శి సౌమ్య, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

## ఉపాధి పనులను నాణ్యతగా చేయాలి : జడ్పీ డిప్యూటీ సీఈఓ


ఉపాధి హామీ రికార్డు పరిశీలిస్తున్న జడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష

మునగాల : ఉపాధి హామీ పనులను నాణ్యతగా చేయాలని జడ్పీ డిప్యూటీ సీఈఓ, మండల ప్రత్యేక అధికారి డి.శిరీష ఉపాధి కూలీలను ఆదేశించారు. మంగళవారం మండల పరిధిలోని ఆకుపాముల గ్రామంలో ఉపాధి కూలీలు చేస్తున్న రోడ్డు నిర్మాణ పనులను ఆమె పరిశీలించి మాట్లాడారు. అదే విధంగా మండల పరిధిలోని కోదండరామాపురం, ముకుందాపురం గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించి మొక్కలను గ్రేడింగ్ చేసి ఖాళీ సంచుల్లో విత్తనాలను పెట్టాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేశ్ దీన్ దయాల్, ఏపీఓ శైలజ, కార్యదర్శులు నాగరాజు, కవిత, ఫీల్డ్ అసిస్టెంట్ ముత్తయ్య, కూలీలు పాల్గొన్నారు.

## పేదల పక్షాన పోరాటం చేసేది సీపీఐ : ఎమ్మెల్సీ నెల్లికంటి


మండల పరిధిలోని నారాయణపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

చిలుకూరు, మే 6 : పేదల పక్షాన నిరంతరం పోరాటం చేస్తూ వారి సమస్యల పరిష్కారం దిశగా అడుగులు వేసేది సీపీఐ పార్టీయే అని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. మండల పరిధిలోని నారాయణపురంలో మంగళవారం పార్టీ మండల 15వ మహా సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీని, వ్యవసాయ రంగాన్ని విస్మరిస్తూ కార్పొరేట్ రంగానికి దోచు పెడుతుందన్నారు. యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించి నిరుద్యోగ సమస్యను అంతమొందించాలన్నారు. మహా సభలో 250 మంది ప్రతినిధులు పాల్గొనగా 35 మంది కౌన్సిల్ సభ్యులు, మండల కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ పార్టీ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు దొడ్డా నారాయణరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, నాయకులు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లు పంపిణీ


పోషకాహార కిట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ రంజిత్

అనంతగిరి, మే 6 : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార కిట్లను మంగళవారం వైద్యుడు రంజిత్‌కుమార్ పంపిణీ చేశారు. ఆరోగ్య కేంద్ర పరిధిలో 23 మంది టీబీ వ్యాధిగ్రస్తులకు నిక్షయ్ పోషకాహార కిట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళలకు న్యాయం చేసేలా పనిచేయాలి

- మహిళా కమిషన్ సభ్యురాలు ఉమాదేవి


సఖి కేంద్రంలో నిర్వాహకులతో మాట్లాడుతున్న మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ ఉమాదేవి

సూర్యాపేట, మే 6 : సఖి కేంద్రానికి వచ్చిన ప్రతి మహిళకు న్యాయం జరిగేలా కేంద్ర నిర్వాహకులు పనిచేయాలని మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ కొమ్ము ఉమాదేవి అన్నారు. జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రాన్ని మంగళవారం ఆమె సందర్శించి మాట్లాడారు. కార్యక్రమంలో సఖి సెంటర్ నిర్వాహకురాలు హేమలత, జిల్లా మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ చైతన్య, శైలజ, కుక్కడపు వినోద్, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య : హెచ్‌ఎం యోగానంద్


ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


నూతనకల్, మే 6 : ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని స్థానిక జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం యోగనంద్ అన్నారు. మండల పరిధిలోని లింగంపల్లిలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మంగళవారం ఆయన బడిబాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనే పిల్లలను చదివించాలని తల్లిదండ్రులను కోరారు. 'బడికి పంపడం మీ వంతు చదువు చెప్పడం మా వంతు' అంటూ ప్రచారం చేశారు.

## 'ఆరోగ్య మహిళ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి'


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి ఆశ్రితారెడ్డి

నూతనకల్, మే 6 : ఆరోగ్య మహిళా శిబారాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారిని ఆశ్రితారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆమె మహిళలకు పరీక్షలు నిర్వహించి మాట్లాడారు. 137 రకాల పరీక్షలు ప్రభుత్వం ఉచితంగా నిర్వహించడంతో పాటు మందులను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ చరణ్‌నాయక్, వైద్య సిబ్బంది తారమ్మ, వెంకట్‌రెడ్డి, ఆనంద్, సీతారాంరెడ్డి తదితరులున్నారు.

## భారీ వర్షం


మేళ్లచెర్వులో గాలి దుమారానికి రోడ్డు పైకి కొట్టుకు వచ్చిన డబ్బాకొట్టు

మేళ్లచెర్వు, మే 6 : మేళ్లచెర్వు మండల వ్యాప్తంగా మంగళవారం రాత్రి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. మండల కేంద్రంలోని కోదాడ, మేళ్లచెర్వు హుజూర్‌నగర్ రోడ్డు లో గల పెట్రోల్ బంక్ సమీపంలో గాలి వానతో పాటు వర్షం కురువడంతో డబ్బా కొట్టు రోడ్డు మీద కొట్టుకొచ్చింది. అక్కడే ఉన్న విద్యుత్ తీగలు తెగి రోడ్డు మీద పడటంతో పెను ప్రమాదం తప్పింది. వర్షం కారణంగా రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

మోతె : మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం వచ్చిన ఈదురు గాలులకు వైన్స్ షాపు రేకులు ఎగిరి పోయాయి. చెట్లు విరిగి పడి, మామిడి మామిడి కాయలు నేల రాలాయి.